"అనూ!"

"........."

"అనూ తల్లీ"

మెల్లిగా భారంగా తలెత్తింది అనుపమ. ఆ కళ్ళలో అశాంతి కళ్ళ క్రింద ఏళ్ళతరబడి అనుభవించిన ఆ అశాంతి తాలూకు నల్లటి గుర్తులు.

మళ్ళీ కళ్ళు మూసుకుంది పాతికేళ్ళ అనుపమ.

తన చేతుల్లో పెరిగి, తన గుండెల మీద ఆడి విపరీతమైన జిజ్ఞాసతో తనని ఊపిరిసలపని ప్రశ్నలువేసి ఆశ్చర్య చకితుణ్ణి చేసిన అనుపమ 'డిప్రెషన్' అనే వ్యాధితో అదే ప్రపంచంలో తనని విపరీతమైన ఆవేదనలో ముంచుతూ మళ్ళీ కళ్ళు మూసుకుంది.

# అనుపమ

## డాక్టర్ పెళ్లకూరు జయప్రద

"అనూ పళ్ళరసం త్రాగుతావా?"

వద్దన్నట్టు తల అడ్డంగా వూపింది. అసలు ఏదైనా తినడం, త్రాగడం అనేవి చాలా భయంకరమైన విషయంగా అన్పిస్తోందాపిల్లకు. ప్రశ్నలు వేసి వేసి ఏ జవాబుతోనూ తను తృప్తిపడలేక అలాటి జీవితంతో రాజీపడలేక ఈ దశకు చేరింది.

"అందరి గురించి ఎందుకమ్మా ఆలోచిస్తావు. నీ కూతుర్ని, ఈ లోకానికి వారసురాల్ని చేయకుండా పెంచుకోరాదూ!" అంతే విరక్తిగా నవ్వుతుంది.

"ఈ ప్రపంచంలో బతికేది నా కూతురొక్కతే కాదుగా బాబాయ్" అని.

"అందరి బాధల్నీ, అందరి ఆవేదనల్నీ, అందరి మోసాల్నీ, చిన్నారి తల్లీ! నీ భుజస్కంధాల మీద ఎందుకు మోస్తావు నువ్వు?" నిట్టూర్చాడా వృద్ధుడు.

అనుపమ నీరసంగా తలెత్తింది... "ఎవరింటికి బాబాయ్ వెళ్ళొస్తున్నావ్?"

ఆమెకు తెలుసు తనెవరింటికి వెళ్ళి వస్తున్నదీ— అయినా తెలిసే ఎందుకు అడుగుతున్నట్టు! ఆశ్చర్య పోతూనే జవాబు చెప్పాడు.

"మీ సాయి మామ ఇంటికెళ్ళొస్తున్నాను".

ఆమె నవ్వింది. ఆ నవ్వులో కొంత ఆవేదన, మరి కొంత విమర్శ.

"బాబాయ్! మరి పావని ఇంటికి ఎందుకు రాలేదు నువ్వు?"

"ఎప్పుడమ్మా?"

నిజానికి ఆ ప్రశ్న వెధవ ప్రశ్న. పావని ఎవరో తనకు తెలుసు. ఎప్పుడు పావని తనను పిలిచిందో తనకు తెలుసు. అయినా తనా ప్రశ్న ఎందుకు వేసాడు?... తను, తన అన్నకూతురు దగ్గర, ఆమె వ్యక్తిత్వం ముందు భయపడ్తాడు. ఆ భయం ఆమె వ్యక్తిత్వం పట్ల గౌరవం, తనకు అలాంటి చచ్చు ప్రశ్న వేసేలా చేసింది. ఆమెకు జవాబివ్వడానికి తనకు కొంత వ్యవధి కావాలి మరి.

"అదే బాబాయ్! ఆ పిల్ల రిసెప్షన్?"

"ఆ......ఆ" గుర్తొచ్చినట్టుగా నటించాడు— ఆ విషయాన్ని తనెప్పుడు మర్చిపోయాడు గనుక!

ఆ రోజు తన ఆఖరి తమ్ముడు కూతురు ఓ సాహసం చేసింది. చాలా పేదవాణ్ణి, యీ సాంఘిక పద్ధతుల దృష్ట్యా అట్టడుగు మనిషి చేయి పట్టుకుని ఏడడుగులు నడచి అతని జీవితంలో మొదటి వ్యక్తిగా అతనితో వెళ్ళిపోయింది. పరాయివాళ్ళు ఆ పనికి హర్షిస్తే అయినవాళ్ళు గర్హించారు. తమ కుటుంబ సభ్యుల్లో ఆ అమ్మాయి ప్రీతిగా పిల్చి ఇచ్చిన రిసెప్షన్‌కి వెళ్ళిన ఒకే ఒక వ్యక్తి అనుపమ.

అనుపమ వెళ్తూ వెళ్తూ తన స్నేహితుడైన తనతో అంది. "బాబాయ్! నా వెనుక నువ్వూ వస్తావన కుంటాను".

తను జవాబివ్వలేదు. తన మీద ఎంత భరోసావో! తన జవాబు వినకుండానే వెళ్ళిపోయింది.

కానీ తన బాబాయ్ గుండె వైశాల్యం మీద ఆ పిల్ల పెంచుకున్న నమ్మకం చెదిరిపోయింది కాబోలు— చెదిరిపోయిన కాటుక కంటితో వచ్చి నిలదీసింది.

"ఎందుకు రాలేదు బాబాయ్?"

ఆ పిల్ల తీక్షణమైన చూపులకు ఆనాడూ తట్టుకోలేక పోయాడు, యీనాడూ తట్టుకోలేకపోతున్నాడు— నీరసించి లోతుకు పోయిన ఆ కనుపాపల్లోకూడా ఎంత తీక్షణత.

ఆ రోజు తనకంటె ఒక తరం చిన్నదైన తన అన్న కూతురు వంక సూటిగా చూడలేక తలవంచుకుని గిల్టీగా అన్నాడు.

"మీ చిన్న బాబాయ్ బాధపడ్తాడుగదమ్మ".

"నా ప్రశ్నకు జవాబు నీ దగ్గరనుండి అది కాదు బాబాయ్ నేనుకోరేది".

తను మాట్లాడలేదు.

"పోనీ బాబాయ్ యీ ప్రశ్నకు జవాబు చెప్పు, పావని తప్పుచేసిందా?"

"..................."

"అంటే...... మౌనంగా వున్నా వంటే నీకూ అన్పిస్తోందన్న మాట— ఆ పిల్ల తప్పుచేసిందని..." ఆమె గొంతులో తన అంచనా దెబ్బ తిన్న భావం.

ఆ పిల్ల కళ్ళలో కనబడ్డ ఓటమి భావానికి చలించి పోయాడు 'తనీ జన్మలో తన అనూ తల్లిని బాధపెట్ట గలడా?'

"పావనీ తప్పుచేసిందని నేనన్నానా తల్లీ..."

"అయితే......"

"కుటుంబం తలెత్తుకోవద్దామ్మా"

నిజానికి తనకా భావంలేదు. ఆ పిల్ల ఇష్టపడ్డ పిల్లాడిని పెళ్ళిచేసుకుంటే కుటుంబాని కేమొచ్చింది?

'కానీ ఏదో జవాబు చెప్పాలి—' అనే భావంతో పాయసంలో పడ్డ ఈగలా తయారయ్యాడు.

"కుటుంబం పరువుపోతోందా? సరే ఒప్పు కుంటాను. అయితే ఆ పిల్లను వెలేస్తే మీ కు టుంబ పరువు ఇంకా పోతుందనుకుంటానేగానీ ఎక్కువవు తుందనుకోను, ఏమంటావు బాబాయ్?"

తను జవాబు చెప్పకముందే ఆ పిల్ల మరలా అందుకుంది.

"పావనిని ఇంట్లోకి రానీకుండా ఎగ్జిబిషన్‌లో బొమ్మలా బయట పెట్టి ప్రజలకు మీరు మంచి టాపిక్

ఇచ్చారు. పావని మన మధ్యే వుందుంటే నోరెత్త డానికి ఎవరూ సాహసించి వుండే వాళ్ళుకాదు. ఎమో నాకలా అవ్పిస్తుంది బాబాయ్! నేను తప్పుగా ఆలోచిస్తున్నానంటావా?''

తవ మామూలు ప్రకారం తన చిన్నారి తల్లి వాదనకు ముగ్దుడయ్యాడు. ఆరేళ్ళ అనూకూడా తనను వాదించి ఓడించేది— ఈ రోజోలెక్కా!

''...........''

''ఏమిటి బాబాయ్ మాట్లాడవు?''

''పావని దగ్గరకెళ్ళక పోవడానికీ దీనికీ ఏవిటి సంబంధమమ్మా''.

ఆమె నీరసపు కనుపాపల్లో కోపపు ఛాయలు, వెంటనే అందులో నిస్పృహ.

''పావని తప్పు చేసిందని ఆనాడు వెలేసారుగా మీరంతా బాబాయ్!''

అవునన్నట్టు తలూపి తల వంచుకున్నాడు.

''పావని తప్పుచేస్తుంటే అంతకు పదింతలు తప్పు సాయి మామ చేసాడు అతన్నెందుకని వెలి వెయ్యలేదు?'' స్థాయి పెంచిన ఆమె కంఠం కీచుగా పలికింది.

విస్తుబోయాడతను.

''సాయి మామ చేసిన పని నీకు తప్పుగా అన్పించలేదా బాబాయ్'' ఆ పిల్ల గొంతులో కొంత దీనత్వం కొంత రోషం.

''సాయి చేసింది తప్పే. వెల్లెలి ఆస్థి ల్యాండ్ సీలింగ్‌లో పోతుందని తన పేరన వేస్తే దాన్ని స్వంతం చేసుకున్నాడు. చాలా ఘోరమైన నేరమే— మైనర్ మేనల్లుళ్ళనన్యాయం చేయడం......''

''మాట్లాడు బాబాయ్.''

''ఏం మాట్లాడను అనూ అయినా అవన్నీ ఏకెందుకు? కాస్సేపు పడుకోరాదూ.''

''పడుకుంటాలే బాబాయ్. మొదట సాయి మామ గురించి నీ గుండెల్లో వుండేది బయటపెట్టు!''

''అతను చేసిందీ తప్పేనమ్మా'' రెండు నిముషాల నిశ్శబ్దం తర్వాత అన్నాడు.

''అయితే అతన్నెందుకు వెలివెయ్యలేదు? వాళ్ళింటికెందుకెళ్ళావ్?'' తీక్షణంగా చూస్తోంది.


''రెండేళ్ళు గడచిపోయినా, వాళ్ళు సుఖంగా వున్నా, పావని నెందుకు ఇంకా మీరు మాలోకి రానీయలేదు?''

ఆమె గుండెల్లో రగిలే మంటల్లోనుండి కొంత శక్తిని పెంచుకుని మెల్లిగా లేచి దిండుకానుకుని కూర్చుంది.

''పావని పెద్దవాళ్ళ మాటకాదని వెళ్ళిపోయింది కదమ్మా''

చురుగ్గా చూసింది అనుపమ.

''అయితే... పావని సుఖపడ్తున్నా, పావని శాంతిగా బ్రతుకుతున్నా మీ కానందంగా, మీరు చేసిన పనికి పశ్చాత్తాపంగా లేదన్నమాట. మీ మాట కాదన్నది కనుక ఆ పిల్ల ఇంటికి మీరు వెళ్ళరన్నమాట, ఎంత స్వార్థం బాబాయ్''.



ఆ పిల్ల గొంతుక, నీరసంతో కుంచుబోతున్నా ఆమె కళ్ళల్లో మాత్రం విపరీతమైన భావ సంపద.

"అది కాదురా" అని ఏదో చెప్పబోతున్న అతన్ని వారించింది. తను కూడా ఈ పెద్దవాళ్ల దురాగతాలను అంతర్గతంగా సమర్థించడంలేదు కానీ వాళ్ళ మోసాలకు తన బంగారుకొండ మనోవ్యధ తెచ్చుకుంటుంటే ఆ పిల్లను అందులో నుంచి లాగే వుద్దేశంతో వాళ్ళను సమర్థిస్తూ మరింత తప్పు చేస్తున్నాడతను.

"ఆ రోజయితే ఆ డబ్బులేని అబ్బాయితో, కులం కాని వాళ్ళతో అడ్జస్ట్ అవలేదని మీరంతా వారించి వుండొచ్చు. మీ ఇంటికి రామని బెదరించి వుండొచ్చు, మా ఇంటికి రానీమని హెచ్చరించి వుండచ్చు కానీ ఈ రోజు వాళ్ళందరిలో ఒకటయిపోయి సలక్షణంగా సంసారం చేసుకుంటోందామె అయినా మీ పట్టుదలలు పోలేదంటే బాబాయ్!... మీరంటేనే నాకసహ్యం వేస్తోంది. మీ బిడ్డ సుఖంకంటే మీమాట ముఖ్య మనుకునే మీ అందరికీ వారసురాలినైన నేనంటే, నా జీవితమంటే రోత పుడ్తోంది" నీరసంగా పడక మీద వాలిపోయిందామె.

"అనూ...అనూ...అలా అనకమ్మా వీళ్ళ గుండెల్లో ఆ పిల్లమీద ఎంత ప్రేమ....."

"ప్రేమా?" నవ్వింది...... నీరసంగా చాలా వ్యంగ్యంగా. "ప్రేమంటే ఇదా బాబాయ్?"

"ప్రేమంటే నా ఉద్దేశమమ్మా..."

"వద్దు బాబాయ్ చెప్పొద్దు ప్రేమంటే ఇదే అయితే మీరందరూ నామీద చూపిస్తున్న ప్రేమకూడా ఇదేనా బాబాయ్!...నేను మీమాట వినకపోతే నన్ను వెలి వేస్తారన్నమాట."

"అదేం మాటలమ్మా"

"పావని ఏ కారణంచేతయినా వాళ్ళతో అడ్జస్ట్ కాలేక వాళ్ళను వదిలేసి మీ కాళ్ళను చుట్టుకోనుంటే మీర ప్పుడు ఆ పిల్లను ఆనందంగా అక్కున చేర్చుకుని ఆదరించి వుందురేమో!! కదూ బాబాయ్."

ఇక్కడ వృద్ధుడు ఆలోచనలో పడ్డాడు. అతని మేధస్సుకు అందిన సత్యం అతణ్నే విచలితుణ్ణే చేసింది. 'నిజమే ఆ పిల్ల అతన్ని వదిలేసి వచ్చుంటే వీళ్ళందరూ ఆ పిల్లమీద సానుభూతి చూపి ఒడిలో దాచుకొనుండే వాళ్ళు — ఈ సమాజంలో ఆ పిల్లకు రెండో పెళ్ళి అంత సులువైన విషయం కాదు కనుక ఆ పిల్ల ఒంటరిగా మిగిలిపోయినా, ఆ పిల్ల కన్నీళ్ళను వీళ్ళూ పంచుకుంటూ సహ జీవనం చేసుండేవాళ్ళు' నిట్టూర్చాడతను.

"ఈ మనస్తత్వానికి ఏ పేరు పెట్టాలి బాబాయ్?" తన మనసులో కదిలిన భావాన్ని ప్రశ్న రూపంలో వదిలింది అనుపమ.

అతనుమాట్లాడలేదు. 'తనబాబాయిని కొంతవరకు అర్థం చేసుకుంది అనుపమ. అతనూ పెద్ద మనుషుల్ని మానసికంగా సమర్థించడంలేదు. అయినా వాళ్ళను సమర్థిస్తున్నట్టు నటిస్తున్నాడు. ఎందుకని? వ్యక్తిత్వం లేకా? సర్దుబాటు మనస్తత్వంతోనా? లేక తనకంటూ భార్యా, బిడ్డలు లేక తన చుట్టూ వాళ్ళను ఎదిరించే సాహసం లేకా?'

ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది అనుపమ — సాయిమామ గురించి, పావని గురించి క్షణం మర్చిపోయి బాబాయ్ మనస్తత్వంలోకొచ్చి పడిందామె.

బాబాయ్ వాళ్ళనెందు కనుసరించాలి? అసలు వాళ్ళ ద్వారా ఏం సుఖపడ్డాడు గనుక

మూసుకున్న ఆమె కనురెప్పల వెనగ్గా అసహనంగా కదులుతున్న కనుపాపలు

బాబాయ్ పెళ్ళి చేసుకుని వుండాల్సింది ——

ఇప్పుడు అతను ఎవరితో బాగున్నా మరొకరు చూడలేరు. ఆ బాగున్న వాళ్ళకు ఆస్థి ఇచ్చేస్తాడని భయం. అందరి దురాశల మధ్య అతనికి పాపం నిజమైన స్నేహితులే లేరు. ఆ రోజు బాబాయ్ డయాబెటిక్ కోమాలో కెళ్ళినప్పుడు అతని చుట్టూ కొన్ని పదుల మంది, అందరి గుండెల్లోనూ అతను బ్రతకాలని కోరిక గాఢంగా, అతి గాఢంగా.— కాని ఆ కోరిక అతను బ్రతికి కనులు విప్పి తమలో ఒకడుగా మారాలని కాదు అతను తన ఆస్థిని ఎవరికి వ్రాసాడో — అసలు వ్రాసాడో లేదో తెలీక.

ఎంతఘోరం! ఎంత రాక్షసత్వం!! — విపరీతమైన వేదనతో ఇక కళ్ళు మూసుకోలేక తెరిచిందామె.

"ఏంరా? బలహీనంగా వుందా?"

"బాబాయ్" అతన్ని అల్లుకుపోయి వెక్కి వెక్కి ఏడ్చింది హఠాత్తుగా అనుపమ.

దోమల వల్ల మీ నిద్ర పాడవుతోందా?




BALSARA ఓడోమాస్
దోమల పాలిట శత్రువు

CHAITRA-B BLS 546 TEL

తనకంటూ జీవితంలేని ఆ వృద్ధుడు తనదవి అనుకున్న అనుపమ వెన్ను సవరిస్తూ నిస్సహాయంగా నిల్చిపోయాడు.

తన స్నేహితుడి గుండెల్లో తలదూర్చి సేద తీర్చుకోడానికి ప్రయత్నిస్తోందామె కానీ ఆమె శరీరమంతా ఏదో మంటలు, శరీరం లోపలంతా చీకటిలాంటి భావం. ఏదో పోగొట్టుకున్నట్టు ఏదో చేయాల్సి చేయలేక పోయినట్టు తనకే అర్థంకాని భావ పరంపరలు, మనస్సు విదిలిచ్చుకున్నా వెంటాడే సందేహాలు.

'అసలు సాయిమామ ఎందుకలా చేసినట్టు, చెల్లెలూ తన రక్తమే, తన బిడ్డలూ తన రక్తమే ఒక రక్తాన్ని మోసం చేసి మరో రక్తానికందించే ఉద్దేశం అసలెందుకొస్తుంది? తనయితే జీవితాంతం ఎంత తపస్సు చేసినా ఆ పని చేయగలదా?'

"బాబాయ్! సాయిమామ తన చెల్లెలి ఆస్థి కొట్టేసి తన పిల్లలకిస్తున్నాడు. రేపొద్దున వాళ్ళు అతన్ని నిర్లక్ష్యం చేస్తే అతనికి షాక్‌రాదూ!" ఇంకిపోయిన కన్నీళ్ళ గొంతుతో అడిగిందామె.

అతను ఓ పదిహేనేళ్ళు ముందుకువెళ్ళి అక్కడ ఓ క్షణం ఆగి ఆలోచించాడు.

నిజమే పిల్లలు అతన్ని నిర్లక్ష్యం చేస్తే షాక్ సంగతి ఏమోగానీ కనీసం చెల్లెల్ని మోసం చేసినందుకైనా పశ్చాత్తాపపడ్తాడు.

ఇదే అన్నాడతను అనుపమతో. పేలవంగా నవ్విందామె —

"నువ్వు ఊహించిందే నాకూఅన్పించింది బాబాయ్, కానీ దానివల్ల ప్రయోజనం ఏమిటి? ఇతను చరమ దశలో పడే పశ్చాత్తాపం అదే — అంతా అయిపోయాక పడే పశ్చాత్తాపంవల్ల ఏవిటి లాభం?" —

"........................................."

"పోనీ ఇలాటి సాయిమామలను చూసి ఎదిగే చిరంజీవి సాయిలన్నా మారుతారంటావా బాబాయ్?... ఊహు మారరు. ఆ స్టేజి వాళ్ళకొస్తేగాని వాళ్ళు పశ్చాత్తాప పడరు.. ఇది నిరంతర స్రవంతి కదూ! బాబాయ్...!

"ఏమో! తల్లీ అవన్నీ అసలు నేను ఆలోచించను. నువ్వు ఆలోచించకు."

"ఆలోచించొద్దా? భలేవాడివే బాబాయ్ అది నా చేతిలో వుందా?" అతను మాట్లాడలేదు. ఆమె భావ ప్రవాహాన్ని ఎలా ఆపాలో ఆ వృద్ధుడికి తెలీడం లేదు.

"ఒకరి జీవితంల్లోనుంచి మరొకరు పాఠాలు నేర్చుకునేపనయితే ఇంత అశాంతి, ఇంత అభద్రత ఎందుకుంటోంది. మనకిచేసేవాళ్ళుఎక్కువవుతూనేవున్నారు. తాగేవాళ్ళు తాగి, లివర్‌పాడై చచ్చిపోయేవాళ్ళు చచ్చిపోతూనే వున్నారు. తాగే జనాభా ఏమీ తగ్గడం లేదు. మోసాలు చేసి పశ్చాత్తాప పడేవాళ్ళు పడ్తూనే వున్నారు. మోసాల సంఖ్య పెరిగిపోతూనే వుంది......"

"అనూ......"

"బాబాయ్ మొన్న ఏమయిందో తెలుసా? మా లలిత లేదూ! తనూ, వాళ్ళమ్మా, వాళ్ళ నాన్నకు హాస్పిటల్‌లో అన్నం పెట్టి రిక్షాలో తిరిగొస్తుంటే ఇద్దరు రిక్షా ఆపి "ఎంత రేటయినా ఇస్తాం ఆ అమ్మాయి కావాలని అడిగారట. ఎంత అసహ్యం! ఇదీ భారతదేశం బాబాయ్."

"భారతదేశాన్ని ఎందుకమ్మా అవడం. కలుపు మొక్కల్లా కొందరలాటి వాళ్ళు......"

"ఆ...ఆ... అదే బాబాయ్ ఈ కలుపు మొక్కలు వుండకూడదు అసలు బాబాయ్ వీళ్ళు తన భార్యనో, తన తల్లినో, తన చెల్లినో ఎవరైనా ఇలా అడిగితే సహించగలరా? ఆ క్షణాన్ని ఒకసారి ఊహిస్తే ఒళ్ళంతా ఝులదరించే ఆ దృశ్యాన్ని ఊహిస్తే ఇలా ఓ ఆడపిల్లను అడిగే నైచ్యానికి దిగజారుతారా?"

"అది వాళ్ళ ప్రొఫెషన్ అయిపోయిందమ్మా"

"ప్రొఫెషన్ అంటే వృత్తి కదూ! బాబాయ్... పోనివ్వండి కోటి విద్యలూ పొట్టకూటి కొరకే ఈ పవిత్ర భారత భూమిలో అదే వృత్తిగా మిగిలిపోయిన దురదృష్టపు ఆడవాళ్ళున్నారు. వాళ్లతో — వాళ్ళతో... అంతేకానీ పదిగంటల వేళ కూడా ఓ ఆడపిల్ల రిక్షాలో వెళ్ళలేని విధంగా ఛీ......ఛీ......" ఆమె కళ్ళు మూసుకుంది.

హఠాత్తుగా మౌనంగా అయిపోయి పడక మీద పొర్లుతున్న అన్న కూతురి వంక జాలిగా చూసాడతను. ఐదు నిముషాల తర్వాత అతనిలో సందేహం—

అనుపమ ప్రక్కలు ఎగరేస్తోంది. దిండులో పూర్తిగా తల దూర్చేసి విపరీతమైన మానసిక వేదనకు గురి అవుతున్న సూచనగా తలాడిస్తోంది.

"అనూ......"

ఆమె తలెత్తలేదు.

ఆ వృద్ధుడికి అర్థం అయింది మరలా అనుపమ డిప్రెషన్‌లోకి జారుకుంటోంది.

ఆమెను బలవంతంగా తన ఒడిలోకి లాక్కున్నాడు. ఆమె వున్నట్టుండి బర్స్ట్ అయింది — ఆమె కన్నీళ్ళతో అతని పంచె తడిసిపోతూనే వుంది.

"అనూ..."

.............................................

"అనూ..."

.............................................

"తల్లీ అనూ!"

ఆమె కళ్ళెత్తి చూసింది కళ్ళునిండిన కన్నీళ్ళు చంపల మీదుగా జారిపోయాయి.

"అనూ తల్లీ! నిన్ను నేనిలా చూడలేనమ్మా. ఆపేయ్ తల్లీ — ఏడ్చి నన్నీ వయస్సులో బాధపెట్టకమ్మా" అతని కళ్ళల్లో కూడా తడి.

ఆమె కళ్ళు తుడుచుకుంది. తల విదిలించింది — ఐదునిముషాల తర్వాత మెల్లిగా నవ్వింది.

ఆ నవ్వు — ఎవరో నవ్వమంటే నవ్వినట్టు, నవ్వకపోతే వీలులేనట్టు భరించలేనట్టుగా, దయనీయంగా.....

"అనూ! అలాకాదు. అలాకాదు తల్లీ మనస్ఫూర్తిగా నవ్వు" బాబాయ్ వంక తదేకంగా చూసింది అనుపమ.

"బాబాయ్ నాకూ నవ్వాలని వుంది బాబాయ్ కానీ ఇప్పుడు కాదు, పావనిలాటివాళ్ళను మీరంతా సమర్థించే రోజు. ఒకరి సమాధులమీద వాళ్ళ పునాదుల్ని తవ్వుకునే సాయిమామలాటి వాళ్ళను మీ పరిధి నుంచి బహిష్కరించినరోజు — ఆడపిల్ల అర్ధరాత్రి నిర్భయంగా నడచి వెళ్ళగలిగే రోజు — ఆ రోజు వస్తే నేను చనిపోకముందే అలాటిరోజు నాకు ఎదురు పడ్తే — నా మనసు పరవశించి ప్రతిధ్వనించేలా, నీ గుండె విచ్చుకునేలా నవ్వాలనుంది బాబాయ్."

ఆమె మరలా వెక్కివెక్కి ఏడుస్తోంది. గుండెలు పగిలేలా ఏడుస్తోంది.

నిరాయుధుడులా, నిస్సహాయుడులా, వెర్రిగా, జాలిగా చూస్తున్నాడు తన ప్రియమైన అన్న కూతురు వంక అతను ——

.............................................

.............................................

.............................................

.............................................

## వింతవార్తలు

"ఇటలీ"లోని "మిలన్" అనే గ్రామంలో "పర్జీనియా" అనే ఒకావిడ వుంది. ఈవిడ భర్త కారు ప్రమాదంలో చనిపోయాడు. పిల్లలు లేరు. కావలసినంత ఆస్థి వుంది. ఒకరిద్దరు స్నేహితులు మాత్రం వున్నారట. మనిషికన్నా విశ్వాసమైన జంతువు కుక్క కాబట్టి కనిపించిన కుక్కలను తీసుకొచ్చి పెంచుకొంటోందిట. ఇప్పుడామె దగ్గర దాదాపు 5,000 దాకా కుక్కలున్నాయుట. 45 సంవత్సరాల నుంచి కుక్కలను చేరదీస్తోందిట.

** ** **

మనకు అతి దగ్గరలో వున్నది ఒక్క సూర్యుడు మాత్రమే. కేవలం 9కోట్ల మైళ్ళ దూరంలో వున్నాడు. మన విమానాల్లో అతివేగంగా పోయేవి "జెట్ విమానాలు". ఒక జెట్ విమానం సూర్యుడిని చేరాలంటే సుమారు 23 సంవత్సరాలు పడుతుంది. అతి శక్తివంతమయిన రాకెట్లను, రోదసీ నౌకలను ఉపయోగించినా కనీసం 6 నెలలు పడుతుందట. అయితే సెకనుకు 1,86,000 మైళ్ళ వేగంతో ప్రయాణం చేసే కాంతి కిరణానికి సూర్యుని నుంచి భూమికి చేరడానికి కేవలం 8.3 నిముషాలు పడుతుందట.

** ** **

ప్రకృతిలో పరిశుద్ధ జలం లేనేలేదట. భూగర్భ జలాల్లో 98 మూల పదార్థములు, భూమిపై జలాల్లో 62 మూల పదార్థములు కలిగి వున్నాయుట. అందు చేతనే మనకు రకరకాల రుచులు గల నీరు లభ్యమవుతూ వుంటుంది.

—విజేంద్రనాథ్ ప్రసాద్